సూర్య
నేటి దినపత్రిక
18వ వసంతంలోకి..
ఎన్టీఆర్ - కృష్ణా
గురువారం 29 ఆగస్టు 2024
పేజీలు 8



## లా & ఆర్డర్ -2 ఏడీసీపీగా జి.రామక్రిష్ణ

విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ : జి.రామక్రిష్ణ ఎస్ఐబీ అనంతపురంలో అడిషనల్ ఎస్.పి. గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల నేపథ్యంలో ఎన్.టి.ఆర్.జిల్లా లా & ఆర్డర్ -2 ఏడీసీపీగా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం తన కార్యాలయంలో, లా & ఆర్డర్ -2 ఏడీసీపీగా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబుని మర్యాదపూర్వకంగా కలిశారు.

### రానున్న మార్చి నాటికి తాగునీటి సమస్యకు

# శాశ్వత పరిష్కారం

- కుడప వద్ద శరవేగంగా జరుగుతున్న కృష్ణాజలాల ప్రాజెక్టు పనులు
- ఎ.కొండూరుతో పాటు మరో మూడు మండలాలలో నీటి శాంపిళ్లను పరీక్షిస్తాం
- అవసరమైన అన్ని ఆవాసాలకూ సురక్షిత కృష్ణా జలాలను సరఫరా చేస్తాం
- వ్యాధి ప్రభావాన్ని తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం
- వ్యాధి బారిన పడిన వారికి పూర్తి వైద్య సహాయం అందిస్తాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

(ఎన్టీఆర్ జిల్లా బ్యూరో/ ఎ.కొండూరు, మేజర్ న్యూస్)

ఎ.కొండూరు పరిసర ప్రాంతాల గ్రామాలకు సురక్షిత కృష్ణా జలాలను అందించేందుకు రూ.50 కోట్లతో వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, రానున్న మార్చి నాటికి పూర్తి స్థాయిలో త్రాగునీటిని సరఫరా చేసి కిడ్నీ వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. ఎ.కొండూరు పరిసర ప్రాంతాలలో కిడ్నీ వ్యాధిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 50 కోట్ల రూపాయలతో రెడ్డిగూడెం మండలం కుదప వద్ద జరుగుతున్న రక్షిత తాగునీటి రిజర్వాయర్ నిర్మాణ పనులను, బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి. సృజన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. రెడ్డిగూడెం మండలం కుదప గ్రామం వద్ద జరుగుతున్న రక్షిత తాగునీటి పథక నిర్మాణం పనులను పరిశీలించడంతోపాటు ఏ.కొండూరు మండలంలోని డీప్లానగర్ తండాలో పర్యటించి తండావాసులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఏ కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను, మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి. సృజన ఎ. కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మీడియా ప్రతినిధులతో 2





## ఆదాయం పెంచడమే లక్ష్యం

- వినూత్న పద్ధతులతో అధిక దిగుబడుల సాధనకు అవకాశం
- వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ 2047 ప్రణాళికలు సిద్ధం చేయడానికి ప్రభుత్వం సంకల్పం
- కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



పామర్రు, ఆగస్టు 28 మేజర్ న్యూస్ : వ్యవసాయ అనుబంధ రంగాలలో వినూత్న పద్ధతులు అవలంభించడం ద్వారా అధిక దిగుబడుల సాధనకు, రైతుల ఆదాయం

మిగతా 2లో...

## గృహాలను నిర్మించకుంటే రద్దే

- రానున్న జూన్ నాటికీ మంజూరైన ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి
- గృహనిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయండి
- కాలనీలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి. సృజన.



ఎన్టీఆర్ జిల్లా బ్యూరో/జి.కొండూరు, మేజర్ న్యూస్ : పేదవానికి సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం ద్వారా పక్కా గృహాలను మంజూరు చేయడం జరిగిందని లబ్ధిదారులు మంజూరైన ఇళ్ల నిర్మాణం చేపట్టి రానున్న జూన్ మాసం నాటికీ పూర్తి చేయకుంటే నిధులు విడుదలయ్యే అవకాశం ఉండదని గృహాలను నిర్మించుకోవడంలో లబ్ధిదారులకు 7



## రానున్న మార్చి నాటికి తాగునీటి సమస్యకు
# శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ కుడప వద్ద నిర్మాణం జరుగుతున్న ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనులను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన గడువుకు ముందే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనులు తుది దశకు చేరుకోగా 200 కి లో మీటర్ల మేర పైపులైన్ల పనులలో ఇప్పటికే 30 కి.లో మీటర్లు పూర్తి కాగా మరో 70 కి.లో మీటర్ల పనులు చివరి దశలో ఉన్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ ఇ డి.వి. రమణ కలెక్టర్‌కు వివరించారు. సంప్ నుంచి కృష్ణా జలాలను శుద్ధి చేసి ఓవర్ హెడ్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తామని అక్కడ నుండి ఎ.కొండూరు మండలంలోని 38 కిడ్నీ ప్రభావిత గ్రామాలు, తండాలకు పైపులైన్లు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయడం జరుగుతుందని వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన్నట్లు కలెక్టర్ తెలిపారు. దశాబ్ద కాలం నుండి ఎ.కొండూరు మండ లోని గ్రామలతో పాటు సమీప గ్రామలలో ప్రజలు కిడ్నీ వ్యాధితో బాదపడు తున్నట్లు తెలిపారు. దీనికి కారణం ఆయా ప్రాంతాలలో భూగర్భ జలాల్లో లోహ మూలకాల శాతం ఎక్కువగా ఉండటం వలనని, నీటి పరీక్షలలో వెల్లడై నదని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు భూగర్భ జలాలను తాగడానికి ఆరోగ్యానికి హనికరమనే ఉద్దేశంతో ప్రభుత్వం సురక్షిత కృష్ణా జలాలను అందించడమే సమస్యకు శాశ్వత పరిష్కారంగా భావించి 50 కోట్ల రూపాయల నిధులతో తాగునీటి ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు. ఎ.కొండూరు మండలంలోని 38 ఆవాసాలకు పైపు లైన్ ద్వారా రక్షిత మంచినీటిని అందించాలన్న బృహత్తర కార్యక్రమాన్ని రానున్న మార్చి నాటికి పూర్తి చేసి నీటిని సరఫరా చేయనున్నట్లు ఆమె తెలిపారు. అప్పటి వరకు 38 ఆవాసాల పరిధిలో 56 పాయింట్లలో ఏర్పాటు చేసిన తాత్కాలిక సింటెక్స్ ట్యాంకుల ఏర్పాటు చేయడం జరిగిందని, ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు కృష్ణా జలాలను ట్యాంకులలో నింపి ప్రజలకు అందిస్తున్నామన్నారు. ట్యాంకులలో కృష్ణాజలాలు నింపడంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి పాయింట్ వద్ద స్థానిక గ్రామస్తులతో కమిటీని ఏర్పాటు చేసి నీటి సరఫరాని పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



**పరిసర మండలాల్లోనూ పరీక్షలు చేస్తాం..**

ఎ.కొండూరు మండలంతో పాటు సమీప రెడ్డిగూడెం, గంపలగూడెం, తిరువూరు మండలాలోని గ్రామాల్లో కూడా భూగర్భ జలాల నమూనాలను పరీక్షించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గంపలగూడెం మండలంలోని రెండు ఆవాసాల్లో నీటిని పరీక్షించగా తాగేందుకు సురక్షితం కాదని తెలిందన్నారు. నాలుగు మండలాల పరిధిలో విస్తృతంగా పరీక్షలు నిర్వహించి, ఫలితాల ఆధారంగా ఏయే గ్రామాలకు సురక్షిత కృష్ణా జలాలను అందించాలో ఆ గ్రామాలన్నింటికీ కుళాయిల ద్వారా నీటిని అందించనున్నట్లు తెలిపారు. వచ్చే మే, జూన్ నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని, ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సురక్షిత తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

**కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సమగ్ర సర్వే**

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారిని పూర్తిస్థాయిలో గుర్తించేందుకు ఎ.కొండూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, తిరువూరు మండలాల్లో సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వ్యాధి ప్రమాదకరంగా మారకుండా అవసరమైన మందులతో పాటు వైద్య సేవల పరంగా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. ఎ.కొండూరు పీహెచ్‌సీ పరిధిలో దాదాపు 216 మంది క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ)తో బాధపడుతున్నారని, వీరిలో 25 మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని వైద్య సేవలను అందించాలని వైద్య అధికారులను ఆదేశించామని కలెక్టర్ సృజన తెలిపారు.

**దీప్లా నగర్ తండా వాసులతో కలెక్టర్ ముఖాముఖి**

ట్యాంకర్ల త్వారా సరఫరా చేస్తున్న సురక్షిత శుద్ధి చేసిన తాగునీటిని మాత్రమే వినియోగించాలని, అవసరమైతే కాచిచల్లార్చిన నీటిని వినియోగించుకుని అనారోగ్య సమస్యలు తలెత్త కుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తండా వాసులకు సూచించారు.




ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తిరువూరు ఆర్‌డీవో కె.మాధవి, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ డీవీ రమణ, ఇన్‌చార్జ్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, డ్వామా పిడి జె. సునీత డిపివో శ్రీనివాస్ యాదవ్ కృష్ణారావు పాలెం గ్రామ సర్పంచ్ పి. నాగమల్లేశ్వరి, ఇన్‌చార్జ్ యంపిడివో కృష్ణ పరమాత్మ, వివిధ శాఖల అధికారులు స్థానిక నాయకులు ఉన్నారు.



# ఆదాయం పెంచడమే లక్ష్యం





(మొదటిపేజీ తరువాయి)

పెంపునకు తద్వారా జిల్లా ఆదాయం పెంచడం వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ -2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు పామర్రు నియోజకవర్గ స్థాయి కార్యశాల బుధవారం పామర్రు మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యశాలలో పాల్గొన్నారు. తొలుత కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ 2047 ప్రణాళికలు సిద్ధం చేయడానికి ప్రభుత్వం సంకల్పించిందని, రాబోయే ఐదేళ్లలో జిల్లాలో వివిధ రంగాల నుండి వచ్చే దిగుబడులు, ఆదాయం (మొత్తం ఆర్థిక కార్యకలాపాలు) 15% పెంచాలని ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇందుకుగాను మండలాల వారి వివిధ శాఖల ద్వారా సిద్ధం చేసిన ప్రణాళికలు ఈ కార్యాశాలలో చర్చించి తద్వారా జిల్లా ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. మండల వారీగా వివిధ శాఖల అధికా రులు తయారుచేసిన యాక్షన్ ప్లాన్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో పలువురు ఆదర్శ రైతులు తమ సూచనలు సలహాలు అందించారు. వ్యవసాయంలో అధిక దిగుబడుల సాధనకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంబించడం, మిశ్రమ పంటల విధానం అమలు చేస్తే రైతుల ఆదాయం పెరుగుతుందని, సేంద్రీయ పద్ధతులలో పండించిన పంటకు మార్కెటింగ్ సౌకర్యంతో పాటు, సేంద్రియ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ సౌకర్యం కల్పిస్తే, రైతుల ఆదాయం మరింతగా పెరిగే అవకాశం ఉందని రైతులు సూచించారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు నవధాన్యాల విత్తనాలు సరఫరా చేయాలని కలెక్టర్ ను కోరారు. ప్రస్తుతం వరి పంట వేసిన తర్వాత పెసర లేదా మినుము వంటి పంటలు సాగు చేస్తున్నారని, ఆ తరువాత వేసవిలో సుమారు నాలుగు నెలలు భూమి ఖాళీగా ఉంటున్నదని, ఏదైనా పంటలు సాగు చేయవచ్చా అని కలెక్టర్ రైతులను ప్రశ్నించగా, కొన్ని ప్రాంతాల్లో పచ్చిరొట్ట పైర్లు సాగు చేయవచ్చని రైతులు సూచించారు. గ్రామాల్లో పశుసంపద పెంచడానికి గోకులం షెడ్స్ ఏర్పాటు చేయాలని, సబ్సిడీపై దాణా అందించాలని మరి కొందరు రైతులు సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో అధిక దిగుబడుల సాధనకు రైతుల ఆదాయం పెంపునకు రైతుల సూచనలు జిల్లా ప్రణాళికలో పొందు పరచడం జరుగుతుందన్నారు. ఆదర్శ రైతులతో సెప్టెంబర్ మొదటి వారంలో మచిలీపట్నంలో ప్రత్యేకంగా కార్యశాల నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ నియోజకవర్గంలో గృహ నిర్మాణ ప్రగతి సమీక్షించారు. లబ్ధిదారులకు స్వయం సహాయ సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నప్పటికీ గృహ నిర్మాణాల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడం పట్ల కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం 100 రోజులలో జిల్లాలో 5 వేల గృహాలు, ఏడాదిలో 15 వేల గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఈ మేరకు ప్రగతి సాధనకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యశాలలో ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, సిపిఓ జి గణేష్ కృష్ణ, డ్వామా పిడి జీవి సూర్యనారాయణ, డిపిఓ నాగేశ్వర నాయక్,జీరో బేస్ట్ నాచురల్ ఫార్మింగ్ జిల్లా అధికారి పార్థసారథి, మార్క్ ఫెడ్ డి ఎం మురళీ కిషోర్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖ తదితర శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ కె.కస్తూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు గానుగ నుండి తీసిన వంట నూనెను జిల్లా కలెక్టర్కు చూపించగా ఆయన పరిశీలించి మహిళలను అభినందించారు.

# తెలుగు సాహిత్యంలో దివిసీమకు ప్రత్యేక స్థానం





## ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** తెలుగు సాహిత్యంలో సంస్కృతి వైభవంలో దివిసీమకు ప్రత్యేక స్థానం ఉందని స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం ఉదయం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ప్రముఖ పాత్రికేయుడు, కవి జి.సూర్యనారాయణ రచించిన "గోరువెచ్చని సూరీడు" తొలి కవితా సంపుటి ఆవిష్కరణ మహోత్సవం జరిగింది. కవి, దివిసీమ సాహితీ సమితి ప్రతినిధి డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ అధ్యక్షతన దివిసీమ సాహితీ సమితి, అవనిగడ్డ ప్రెస్ క్లబ్, దివి జర్నలిస్ట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు పుస్తక ఆవిష్కరణ చేసి ముఖ్య అతిథి ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాదుకు అంకితం ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాహితీ సౌరభాలు పరిమళించే దివిసీమలో సాహిత్య పరిమళాలు గుబాళిస్తూనే ఉన్నాయని కవి సూర్యనారాయణ మరోసారి నిరూపించారన్నారు. రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ జీ.వీ పూర్ణచంద్ పుస్తక సమీక్ష చేశారు. గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ భాష పట్ల సాహిత్యం పట్ల అభిరుచిని భావితరాలకు అందించాలన్నారు. కాశీ కవి, అచ్చ తెలుగు అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ మాట్లాడుతూ మానవ సంబంధాలు, దివిసీమ ఖ్యాతి, మాతృభూమి, మాతృభాష ప్రాముఖ్యత ఉద్భోధించేలా గోరువెచ్చని సూరీడు కవితలు ఉన్నాయన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచందు పుస్తక సమీక్ష చేస్తూ భూమిపై జీవన గమనం మొత్తం సూర్యుని గమనంపైనే ఆధారపడి ఉంటుందని, జ్ఞానదాయకుడైన సూర్యుని పేరుతో రూపొందించిన గోరు వెచ్చని సూరీడు కవితా సంపుటి రూపొందించిన సూర్యనారాయణ పదునైన భావాలతో కవితలు రచించారన్నారు. కలుగులో ఉన్న తనను వెలుగులోకి తెచ్చిన అసలు సిసలు గోరువెచ్చని సూరీడు మండలి బుద్ధప్రసాదుకు అంకితమిచ్చి సూర్యనారాయణ తన మిత్రునికి కవితల మాలను కానుకగా ఇచ్చారన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అప్పికట్ల శ్రీనివాసరావు, పుట్టి శ్రీనివాసరావు,సీనియర్ జర్నలిస్ట్ లు సింహాద్రి కృష్ణప్రసాద్, దీవి సారంగపాణి అయ్యంగార్, కాశీ కవి డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, కవులు, రసజ్ఞులు, పండితులు, సాహితీ మిత్రులు, అభిమానులు, పాత్రికేయ సోదరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సేవ అంటే స్వయంగా పరమేశ్వరుడికి చేసినట్లే..

## ఎన్‌టీఆర్ జిల్లా ఆర్.యస్.యస్ ప్రబంధక్ ఎ.జి.కృష్ణప్రసాద్



**గన్నవరం, ఆగస్టు 28, మేజర్ న్యూస్ :** దివ్యాంగులకు సేవ అంటే స్వయంగా పరమేశ్వరుడికి చేసినట్లేని ఎన్.టీ ఆర్ జిల్లా ఆర్.యస్.యస్ ప్రబంధక్ ఎ.జీ కృష్ణప్రసాద్ అన్నారు. విజయవాడలో బుధవారం ఎన్.టీ ఆర్ జిల్లా ఆర్.యస్.యస్ ప్రబంధక్ ఎ.జీ కృష్ణప్రసాద్ ని అఖిల భారత శ్రీకృష్ణ దేవరాయల సంఘం నేషనల్ కన్వీనర్, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, ఉమ్మడి కృష్ణా జిల్లా కాపు ఉపకులాల జే.ఏ.సి చైర్మన్ గౌంతెన రాజ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎన్.టీ ఆర్ జిల్లా ఆర్.యస్.యస్ ప్రబంధక్ ఎ.జీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సభ్యులే కాబట్టి తోటివారికి సహాయం చెయ్యాలని అప్పుడే జీవితానికి సార్థకతని అయన అన్నారు. గన్నవరం ప్రాంతంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్పందన మానసిక వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి దివ్యాంగులకు అత్యున్నతమైన సేవలను చేస్తునట్లు విన్నామని ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్‌ను కృష్ణప్రసాద్ అభినందనలు తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పరిధిలో పనిచేస్తున్న సాక్షం దివ్యాంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ దివ్యాంగుల అభివృద్ధికి సంక్షేమానికి నిరంతరం పాటుపడుతుందని అలాగే మహిళల సాధికారత, రైతుల అభివృద్ధికి కృషి చెయ్యాలని, స్వచ్ఛంద సంస్థలు మన భారతదేశ అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నాయని ఈ సమాజానికి సేవలు చెయ్యడానికి మరిన్ని సంస్థలు ముందుకి రావాలని కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. సమాజంలో తన వంతుగా పేదలకు, విద్యార్థులకు, దివ్యాంగులకు సహాయం చేస్తున్న సేవలకు ఉమ్మడి కృష్ణా జిల్లా కాపు ఉపకులాల జే.ఏ.సి చైర్మన్ గౌంతెన రాజ్ కుమార్ ని కృష్ణప్రసాద్ ప్రశంసించారు.

# కరెంట్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



**గన్నవరం, ఆగస్టు 28, మేజర్ న్యూస్ :** కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్లో వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభ జరిగింది. దీనికి సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ప్రజల మీదకు కరెంటు బారాలు ముంచుకొస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం చాప కింద నీరులా.. స్మార్ట్ మీటర్లను పెట్టిస్తుందన్నారు. అదే జరిగితే ఫోన్ రీఛార్జ్ చేసుకున్నట్లుగానే విద్యుత్ కూడా రీఛార్జి చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇప్పటికే వైసిపి ప్రభుత్వం అనుసరించిన విధానాలతో రూ. 42 వేల కోట్లు భారం వేశారని తెలిపారు. కొత్త పాలకులు మళ్ళీ కరెంట్ భారలు వేయడానికి సిద్ధం జేస్తున్నట్లు చెప్పారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని చెప్పారు. సిపిఐ నాయకులు జోషి మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల విధానం చూస్తే గ్యాస్ సబ్సిడీ మాదిరి అవుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు మాజీ సీఎం జగన్ ఈ విధానం తీసుకువచ్చారని తెలిపారు. 24 ఏళ్ల కిందట ప్రభుత్వం జరిపించిన పోలీసు కాల్పుల్లో రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలు చనిపోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, విజయరావు, రంగారావు, తాతబాయి, ఏసుదాసు, మీరా ఖాన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొండా వీరాస్వామి, తిరివీధి సుబ్బారావు పాల్గొన్నారు.

## సోనీ ఇండియా నుంచి తదుపరితరం వ్లాగింగ్ కెమెరా





**విజయవాడ మేజర్ న్యూస్ :** తమ జెడ్వీ-ఈ10 కెమెరా యొక్క రెండవ తరం జెడ్వీ-ఈ10 2ను సోనీ ఇండియా విడుదల చేసింది. అసలు సోనీ ఇండియా అనేది సోనీ యొక్క జెడ్వీ కంటెంట్ క్రియేషన్ కెమెరా సిరీస్ లో ప్రధానమైన ఏపీఎస్-సీ కెమెరా, ఇది ఏ స్థాయి కంటెంట్ సృష్టికర్తలకైనా సులభమైన, సౌకర్యవంతమైన, వైవిధ్యమైన సాధనాన్ని అందించడానికి రూపొందించబడింది. కొత్త జెడ్వీ-ఈ10 2 క్రియేటివ్ లుక్స్, ప్రొడక్ట్ షోకేస్ సెట్టింగ్, బ్యాక్ గ్రౌండ్ డిఫోకస్ ఫంక్షన్, వారి-యాంగిల్ ప్లిప్ స్క్రీన్ వంటి క్రియేటర్లు ఇష్టపడే అన్ని ఫీచర్లను నిర్వహిస్తుంది. ఈ మోడల్‌కు కొన్ని అదనపు అప్డేట్లలో మెరుగైన ఆటో ఫోకస్, వీడియో క్యాప్చరింగ్ సామర్థ్యాలు ఉన్నాయి. సినిమాటిక్ వ్లాగ్ సెట్టింగ్, కొత్త వర్టికల్ ఫార్మాట్ యూజర్ ఇంటర్ఫేస్, మెరుగైన స్టామినా కోసం అప్గ్రేడ్ చేసిన పెద్ద సామర్థ్య బ్యాటరీ సోనీ జెడ్ బ్యాటరీ, సులభమైన ప్రత్యక్ష ప్రసారం, డేటా బదిలీ కోసం మెరుగైన కనెక్టివిటీ వున్నాయి. ఈ నూతన కెమెరా దాదాపు 377 గ్రాముల బరువుతో సులభంగా క్రియేటర్ల చేతికి సరిపోతుంది.

## తెలుగుషాదీ. కామ్ పదేళ్ల వేడుక సందర్భంగా షాదీ ఉత్సవం పోటీ




**విజయవాడ మేజర్ న్యూస్ :** షాదీ.కామ్ గ్రూపునకు చెందిన మ్యాచ్ మేకింగ్ ప్లాట్‌ఫారమ్ తెలుగుషాదీ.కామ్, తమ 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని తమ గ్రాండ్ 'షాదీ ఉత్సవం' పోటీని ప్రకటించింది. అక్టోబర్ 14న ముగియనున్న ఈ రెండు నెలల వేడుక ద్వారా ఒక విజేతకు పూర్తి-ప్రాయోజిత వివాహం బహుమతిని గెలుచుకునే అవకాశాన్ని అందిస్తుంది. ఇది కాకుండా, 20 మంది వినియోగదారులు బంగారు నాణేలను గెలుచుకునే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా షాదీ.కామ్ మార్కెటింగ్ డైరెక్టర్ మనీష్ ఎం మాట్లాడుతూ, లక్షలాది మంది తెలుగు వినియోగదారులకు కృతజ్ఞతలు తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఉద్దేశించబడిందని అన్నారు. యూజర్‌లు కలల భాగస్వామిని కనుగొనడాన్ని సులభతరం చేయడంతో పాటుగా, తమ కలల వివాహాన్ని చేసుకునేలా ఈ షాదీ ఉత్సవంతో చేస్తున్నామని పేర్కొన్నారు.

## ఫుల్లీ లోడెడ్ ది ఐక్యూ జెడ్9ఎస్




**విజయవాడ, ఆగస్ట్ 28, మేజర్ న్యూస్ :** ఐక్యూ అధిక-పనితీరు గల స్మార్ట్‌ఫోన్ బ్రాండ్, ఐక్యూ జెడ్9ఎస్ ప్రో 5జీ, ఐక్యూ జెడ్9ఎస్ 5జీతో సహా పూర్తిగా లోడ్ చేయబడిన ఐక్యూ జెడ్9ఎస్ సిరీస్‌ను ఇటీవల ప్రారంభించడంతో పరిశ్రమ బెంచ్‌మార్క్ లను మళ్లీ సెట్ చేసింది. ఐక్యూ జెడ్9ఎస్ సిరీస్ 'మెగాటాస్కర్స్' కోసం పూర్తిగా లోడ్ చేయబడింది'. ఇది ఈ స్టోర్, అమెజాన్‌లో రేపటి నుంచి అమ్మకానికి అందుబాటులో ఉంటాయి. ఐక్యూ జెడ్9ఎస్ 5జీ, 8జీబీ ప్లస్ 128జీబీ కోసం రూ.19,999 (సమర్థవంతమైన ధర రూ.17,999) ధర 8జీబీ ప్లస్ 256జీబీకి రూ. 21,999 (సమర్థవంతమైన ధర రూ.19,999), 12జీబీప్లస్ 256జీబీకి రూ.23,999 (సమర్థవంతమైన ధర - రూ. 21,999), ఆగస్ట్ 29న మొదలుకొని టైటానియం ఎక్స్ 2 పీఎం రెండు రంగులలో ఆకుపచ్చ రంగు వేరియంట్లు, ఆకర్షణీయంగా 12 పీఎంకి అందుబాటులో ఉంటుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 5జీ ద్వారా ఆధారితమైన ఐక్యూ జెడ్9ఎస్ 5జీ, మెగాటాస్కింగ్, పెర్ఫార్మెన్స్ ఆప్టిమైజేషన్‌లో అద్భుతంగా 7ఎల్ ప్లస్ ఏఎన్టీయూటీయూ స్కోర్‌ను సాధించింది. ఇది బ్యాటరీ జీవితాన్ని గణనీయంగా పొడిగిస్తుంది. ఇది భారీ వినియోగదారులకు అనువైనదిగా చేస్తుంది. సొగసైన 7.49 ఎంఎం బాడీని కలిగి ఉంది. ఐక్యూ జెడ్9ఎస్ దాని విభాగంలో స్లిమ్మెస్ట్ కర్వ్ స్మార్ట్‌ఫోన్. దాని స్లిమ్ డిజైన్ ఉన్నప్పటికీ, ఇది భారీ 5500ఎంఏహెచ్ బ్యాటరీని ప్యాక్ చేస్తుంది. అద్భుతమైన 3డీ కర్వ్ అమలోడ్ డిస్‌ప్లేను కలిగి ఉంది. ఐక్యూ జెడ్9ఎస్ 1800 నట్స్ స్థానిక గరిష్ఠ ప్రకాశంతో దాని వర్గంలో అత్యంత ప్రకాశవంతమైన వక్ర స్మార్ట్‌ఫోన్‌గా కూడా ప్రకాశిస్తుంది.







# 3వ రోజు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎస్ఏఏపీ ఆదేశాలు మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా అధికార సంస్థ, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా వారు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు సందర్భంగా 3 వ రోజు ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీబాల్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఫుట్ బాల్, కబడ్డీ, జల క్రీడలు, యోగా క్రీడలు నిర్వహించగా సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి తెలిపారు.





## అంగన్వాడి కేంద్రాలు ఆకస్మిక తనిఖీ

**నందిగామ, ఆగస్టు 28, మేజర్ న్యూస్:** మండలంలోని అంబారుపేట, ఐతవరం గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు ఇళ్ల స్థలాలను బుధవారం ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారిణి జి.ఉమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబర్పేట ఐదు వరం గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల హాజరు శాతం, భోజనం పనితీరు పెరటి తోటల పెంపకాలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని ఆమె తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరావు హౌసింగ్ శాఖ అధికారులతో కలసి అంబర్పేట ఐతవరం గ్రామాలలో నిర్మాణంలో ఉన్న ఇల్లు ఇళ్ల స్థలాలను వివరాలు తెలుసుకొని ఇళ్ల స్థలాలు నిర్మాణాలు లబ్ధిదారులతో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ వెంకట్రావమ్మ, పలు శాఖల అధికారులు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## నూతన వాహనాన్ని ప్రారంభించిన రవాణా శాఖ ఏవో




**నందిగామ, ఆగస్టు 28, మేజర్ న్యూస్:** నగర పంచాయతీ పరిధిలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్నటువంటి ప్రతాప్ టీవీఎస్ షోరూం లో బుధవారం టీవీఎస్ జూపిటర్ 110 సిసి గ్రాండ్ లాంచింగ్ ఆర్టిఏ పరిపాలన అధికారి బి ప్రభాకర్ లింగం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి షోరూం నిర్వాహకులు ఆయనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు ప్రారంభించడమే కాకుండా ఆయన వాహనాన్ని ట్రయల్ రన్ చేశారు.అనంతరం ప్రతాప్ టీవీఎస్ షోరూమ్ అధినేత కేవీ ప్రతాప్ మాట్లాడుతూ మార్కెట్లో 110 సిసి స్కూటర్ విభాగంలో జుపిటర్ 110 సిసి స్కూటర్ అధునాతన ఫీచర్స్ తో మార్కెట్లో ఎక్కువ ఫీచర్స్ తో తక్కువ ధరకు లభ్యమవుతున్నదని ఎక్స్ షోరూమ్ ధర 77,200గా కంపెనీ నిర్ణయించిందని ఆయన తెలియజేశారు ఇంతవరకు జుపిటర్ 110 సిసి వాహనాన్ని ప్రజలు ఆదరించారని అదే విధంగా మరింత అధునాతనమైన నూతన ఫీచర్స్ తో ఉన్నటువంటి ఈ స్కూటర్ను కూడా ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్టిఏ పరిపాలన విభాగపు అధికారి బి.ప్రభాకర లింగం గౌస్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ అధినేత పఠాన్ గులాం గౌస్,14 వ వార్డు కౌన్సిలర్ కామసాని సత్యవతి టీవీఎస్ షోరూం ఇంజనీర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్లో ఫ్యామిలీ డే సెలబ్రేషన్స్






**నందిగామ, ఆగస్టు 28, మేజర్ న్యూస్:** పట్టణంలోని రైతు పేట శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ప్రిన్సిపల్ పవారి ఆధ్వర్యంలో ఘనంగా ఫ్యామిలీ డే సెలబ్రేషన్స్కు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు గేమ్స్ నిర్వహించారు. గెలుపొందిన వారికి మెడల్స్ ప్రిన్సిపల్ రమేష్ పవారి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రమేష్ పవారి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నర్సరీ ఎల్కేజీ యూకేజీ నుండే మొదలవుతుంది ఇప్పటి నుండే విద్యార్థులు మెరుగ్గా చదువుకునేలా తల్లిదండ్రులు చూసుకోవాలని ప్రతినెల స్కూలుకు వచ్చి వారు ఏ విధంగా చదువుతున్నారో టీచర్స్ ని అడిగి తెలుసుకోవాలన్నారు.

మా స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు వారికి అర్థమయ్యేలా అత్యుత్తమంగా మా ఉపాధ్యాయులు చదువు చెప్తారని తల్లిదండ్రులు కూడా వారు ఏ విధంగా చదువుతున్నారో కూడా తెలుసుకొని ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లింగాలపాడు ప్రజలకు మంచినీరందించాలి




**నందిగామ, ఆగస్టు 28, మేజర్ న్యూస్:**దాహం కేకలతో లింగాలపాడు గ్రామ ఎస్సీ ఎస్టీ కాలనీలో నెల రోజుల నుంచి మంచినీరు అందక పోయినా అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఎం నాయకులు మండిపడ్డారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో ఎస్ సి,ఎస్ టి కాలనీలలో నెల రోజుల నుండి మంచి నీరు సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ నందివామ సిపిఎం పార్టీ ఆద్వర్యంలో బుధవారం నందిగామ మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతిపత్రం అందజేశారు. గుక్కెడు మంచినీరు కోసం పొరుగు గ్రామాలు వెళ్లి మంచినీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని, మంచినీరు లేక ఉప్పునీరు తాగి ప్రజలు ఫ్లోరైడ్ బారిన పడుతున్నారని తెలిపారు.తక్షణమే మంచినీరు సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లింగాలపాడు గ్రామంలో పారిశుద్ధ్యం బాగా లేదని,ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని, గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని,గేదెలు రోడ్ల మీద కట్టేయడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. తక్షణమే లింగాలపాడు ఎస్ సి,ఎస్ టి కాలనీలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని, మంచినీరు సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. డ్రెయినేజీ సిస్టమ్ మెరుగుపర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరి వెంకటేశ్వర రావు,గోపినాయక్, లాజర్,వేల్పుల.ఏసోబు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి లక్ష్యంగా బీజేపీ పాలన కొనసాగుతుంది



**నందిగామ, ఆగస్టు 28, మేజర్ న్యూస్:** బిజెపికి రాజకీయాలు ఎలక్షన్ల వరకు మాత్రమే తరువాత అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగుతుందని బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధికారి ప్రతినిధి కేదా ర్నాథ్ తెలిపారు. బుధవారం కేంద్ర క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం కోరిన మొదటి విడత పోలవరం ప్రాజెక్టు నిధులు 12,500 కోట్లు అలానే ఓర్వకల్లు దగ్గర ఇండస్ట్రీ పార్క్ 2500 కోట్లు ఆంధ్రప్రదేశ్ యువతకు రైతులకు ఎంతో మేలు కలిగిస్తాయని ఆయన తెలిపారు దీని ద్వారా ఆర్థిక సంపద పెరిగి ఉద్యోగ కల్పన ఏర్పడి అటు రైతులకు ఇటు యువత వేరే రాష్ట్రాలకు పోకుండా తమ ప్రాంతాలలోనే నివసిస్తూ కుటుంబాలతో హాయిగా జీవనం సాగిస్తారని తెలిపారు.ఈ సందర్భంగా ప్రధాని మోడీకి, ఆర్థిక మంత్రి నిర్మల సీతా రామన్‌కి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి రైతుల తరఫున యువత తరఫున ధన్యవాదములు తెలిపారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుకే..




## డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్

## కేయూలో ర్యాగింగ్, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** విద్యార్థుల పట్ల స్నేహపూర్వక వాతావరణం కల్పించడం కోసం ప్రారంభించిన ర్యాగింగ్ రూపం మార్చుకుని భూతం లా మారిందని, ఎవరైనా దాని జోలికి వెళితే జైలుకి పోవడం ఖాయం అని డీఎస్పీ ఎండి అబ్దుల్ సభాన్ హితవు పలికారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాగింగ్, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మధ్య తరగతి కుటుంబాల నుండి ఎక్కువ విద్యార్థులు చదువుకుంటున్న పరిస్థితులలో తల్లి దండ్రులు ఎంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తున్న విషయాన్ని గమనించి క్రమ శిక్షణతో భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి అని పేర్కొన్నారు. దారి తప్పితే శిక్ష పడటంతో పాటు భవిష్యత్‌ను కోల్పోవడం జరుగుతుంది అని హెచ్చరించారు. సెంట్రల్ అడినిస్ట్రేటర్ పంచాంగం అర్తిష్మ మాట్లాడుతూ పాఠశాల విద్య నుండి కళాశాల విద్యలోకి వస్తున్న దశలో విద్యార్థులకు లభించే స్వాతంత్ర్యంను దుర్వినియోగం చేసుకునే వారు చెడు అలవాట్లకు బానిసగా మారతారు అని అది వారి భవిష్యత్ ను అంధకారంలోకి తీసుకెళుతుందని గుర్తించాలన్నారు.

ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వాలు చట్టాలు అమలు చేయడం జరుగుతుంది అని గుర్తించాలన్నారు. ఇందు కోసం ప్రభుత్వాలు, విద్యాసంస్థలు అనేక అవగాహన సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ఆర్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏసుబాబు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# ఉచిత హోమియో మందుల పంపిణీ




**నందిగామ, ఆగస్టు 28, మేజర్ న్యూస్:** కోనయ పాలెం గ్రామంలోని పరిషత్ ఉన్నత పాఠశాలలో సహాయ ఫౌండేషన్ నందిగామ వారి సౌజన్యంతో వైరల్, సీజనల్ వ్యాధుల నివారణకు భాను హోమియోకేర్ డాక్టర్ కాపా భాను ప్రసాద్ ద్వారా పంపిణీ చేయబడిన హోమియో మాత్రలను 300 మంది విద్యార్థులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు వాసిరెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు ప్రముఖ వైద్యులు డాక్టర్ కాపా భాను ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మార్కపుడి వెంకట్రావమ్మ, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ మార్కపూడి జాన్ కోటయ్య, వైస్ చైర్మన్ ధీకొండ నాగ శాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివిఎల్ నారాయణ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ సేవ శిబిరానికి అన్ని ఏర్పాట్లు సజావుగా పూర్తి చేయాలి

## సివిల్ జడ్జి కె.వి రామకృష్ణయ్య



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఈనెల 31 తేదీన పెడనలో నిర్వహిస్తున్న న్యాయ సేవ శిబిరానికి సమన్వయంతో అన్ని ఏర్పాట్లు సజావుగా పూర్తి చేయాలని జిల్లా న్యాయ సేవా సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి రామకృష్ణయ్య జిల్లా అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం నగరంలోని న్యాయస్థానాల సముదాయంలోగల న్యాయ సేవా సదన్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జిల్లా ఇన్చార్జి రెవెన్యూ అధికారి జి శ్రీదేవి తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి నూతన న్యాయ సేవా శిబిరం ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నూతన విధానంలో న్యాయ సేవా శిబిరాన్ని ఈనెల 31వ తేదీన ఉదయం 10 గంటలకు పెడన మండలం నందమూరు గ్రామంలోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా గంజాయి వంటి మత్తుమందు వాడకం రాను రాను ఎక్కువైందని పాఠశాల విద్యార్థుల వద్దకు చేరుతుందన్నారు. దీనిని నివారించడంతోపాటు బాధితులకు న్యాయ సేవలు అందించడం, ఆ మత్తుమందు ముప్పు నిర్మూలన, సీనియర్ సిటిజనులకు గల హక్కులు, ప్రయోజనాలు, న్యాయ సేవలు అనే అంశాలపై ప్రధానంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యకలాపాలను వివరిస్తామన్నారు. అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను, వాటి ప్రయోజనాలను వివరిస్తూ సంబంధిత ప్రభుత్వ శాఖలు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయడంతో పాటు దరఖాస్తు పత్రాలు, కరపత్రాలు, బ్రోచర్లు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ శిబిరంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు అధికారి పాల్గొంటారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాదాలు నియంత్రించడానికి అవసరమైన అగ్నిమాపక యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వేదిక వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య పరీక్షలు చేసి కావాల్సిన మందులు ఇచ్చేందుకు వీలుగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. శిబిరానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి ఎస్ వి డి ప్రసాద్, జిల్లా అగ్నిమాపక అధికారి డి ఏసు రత్నం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్రావు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, ఎల్డిఎం జయవర్ధన్, ఉపవిద్యాధికారి శేఖర్ సింగ్, డి ఆర్ డి ఏ ఏ పీ ఎం రాజా గోవింద్, సహాయ బీసీ సంక్షేమ అధికారి అలియా బేగం తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.





## సహాయ ఫౌండేషన్ చేపట్టిన రూ.15ల భోజనం

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** సహాయ ఫౌండేషన్ చేపట్టిన రూ.15/- భోజనం కార్యక్రమం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పేద ప్రజల దీవెనలు, బందరు ప్రజల ఆశీస్సులతో దిగ్విజయంగా కొనసాగుతుంది. శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా బుధవారం కృష్ణదాస్ తరుపున పేదలకు బోజానాలను అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్ బాషా, మహిళ విభాగం కోశాదికారి మాజేటి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షతగదు




**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపట్లవివక్ష చిన్న చూపు తగదని అంకిత ప్రాజెక్ట్ మేనేజర్ టి.అరుణ్ కుమార్ అన్నారు. ఎయిడ్స్/హెచ్ఐవి, క్షయ వ్యాధులపట్ల కృష్ణాజిల్లాలో రెండు నెలలపాటు జరిగే అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇందిరానగర్ కాలనీలో డ్వాక్రా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన మీకు తెలుసా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్/ హెచ్ఐవి అంటువ్యాధి కాదని ఎయిడ్స్/ హెచ్ఐవి వ్యాధి సోకిన వారిని ముట్టుకున్నా, వారితోకలిసి తిరిగినా, వ్యాధిసోకదని అందువల్ల వారిని చిన్నచూపు చూడకుండా వారిపట్ల సోదరభావంచూపించాలని అన్నారు. హెచ్ఐవి/ ఎయిడ్స్, క్షయ వ్యాధిసంబంధం గురించి, సుఖ వ్యాధులు, చికిత్స గురించి, హెచ్ఐవి/ఎయిడ్స్ యాక్ట్ 2017, మందులు, టోల్ ఫ్రీనెంబర్ 1097 గురించి విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేశారు. ఇందిరా నగర్ కాలనీ డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన ఈ సదస్సులో పాల్గొన్న గ్రామంలోని మహిళలు పురుషులకు అవగాహనకల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంజి.లావణ్య, పిడిజి.బేబీసరోజినీ, అంకితసభ్యులు కే.పార్వతి, బి.లలిత, బి.నాగ మారుతి, సిహెచ్.క్రాంతి,ఎం.రాజమ్మ, డి.జ్యోతి, పి విజయదుర్గ, జి.నాగమణి, బి.విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్య సేవలలో..

# డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కృష్ణ జిల్లా డా ఎన్టీఆర్ వైద్య సేవా పథకం క్రింద పని చేసే నెట్వర్క్ ఆసుపత్రులలో పేద రోగుల నుంచి డబ్బులు వసులు చేసినట్లు రుజువు ఐతే ఇకపై కఠిన చర్యలు తప్పవని బుధవారం జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ సూచనల మేరకు డిఎంహెచ్ఓ గీతాబాయి అన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ సీఈఓగా పనిచేసిన అనుభవంతో జిల్లాలో పథకం యొక్క పనితీరు ఇతర అంశాలు క్షుణంగా పరిశీలించారు. కొన్ని ఆసుపత్రులలో రోగనిర్ధారణ నిమిత్తం డా "ఎన్టీఆర్ వైద్య సేవ లబ్దిదారులైన రోగులనుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి అవి నిర్ధారించి డీడీసీ కమిటీలో విచారణ జరిపి బాధ్యులైన యాజ్యమానానికి జరిమానా విధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎమ్‌చ్ఓ డా గీతాబాయి, డిసి హెచ్ ఎస్ డా శ్రవణ్ కుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాసతీష్ కుమార్, కమిటీ సభ్యులు డా కేశవ కృష్ణ పాల్గొన్నారు.









# మంచినీటి సమస్యలు పరిష్కరించండి

### అధికారులకు ఆదేశాలు ఇచ్చిన కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : మంచినీటి సమస్యని సత్వరమే పరిష్కరించాలని మరమ్మతుల్లో ఉన్న వాల్వ్ ను వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అధికారులను ఆదేశించారు. తన పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం ఫైజర్ పేట పర్యటించి క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. పారిశుద్ధ్య నివారణ సక్రమంగా జరగాలని కాలువల్లో గ్రేటింగ్ పెట్టడం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ సులభతరం చేస్తూ, పారిశుద్ధ్య నిర్వాహణ చెయ్యాలని అన్నారు. తన పర్యటనలో భాగం గా మరుగుదొడ్లను పరిశీలిం చారు. మరుగుదొడ్ల నిర్వాహణ పరిశుభ్రంగా ఉండాలని, ఎటువంటి అపరిశుభ్రతకు అవకాశం లేకుండా మరుగుదొడ్ల నిర్వహణ చేయాలని ఆదేశించారు. సైడ్ కాలవల్లోని పూడికలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, రోడ్డు పైన ఉన్న వ్యర్థలను ఎప్పటికప్పుడు తీస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తో పాటు జోనల్ కమీషనర్ రమ్య కీర్తన, యస్ ఈ (ప్రాజెక్ట్) రామ్మోహన్, ఈ ఈ ఏ. యస్.ఎన్ ప్రసాద్,డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్ర బోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



## బావ, మరదలిపై దారి దోపిడీ

**గన్నవరం, ఆగస్టు 28, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం ముస్తాబాద్ శివారులో సోమవారం అర్ధరాత్రి దారి దోపిడీకి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన వెంకటేశ్వర్లు మరదలు అయిన శిరోమ ణితో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ముస్తాబాద్ వస్తుండగా నలుగురు బైక్‌లపై వచ్చి వారిని అడ్డుకొని బంగారపు గొలుసు, ఉంగరం, సెల్ ఫోన్ బలవంతంగా లాక్కొని పోయారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా నలుగురిలో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయానికి శంకుస్థాపన



**మొవ్వ (ఆగస్టు 28) మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కోసూరు గ్రామం లో సుమారు 50 లక్షలు వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయానికి స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా బుధవారం భూమి పూజ చేశారు. ఎంతో వ్యయ ప్రయాసలుకోర్చి శబరిమలై వెళ్లి మొక్కులు తీర్చుకునే అయ్యప్ప భక్తులకు నూతనంగా నిర్మించనున్న అయ్యప్ప స్వామి దేవాలయం భక్తులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అయ్యప్ప స్వామి దేవాలయాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చిన అయ్యప్ప భక్తులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు అయ్యప్ప భక్తులు, అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూజివీడు ట్రిపుల్ ఐటీలో జ్వరాల బారిన విద్యార్థులు



**నూజివీడు, మేజర్ న్యూస్:** పట్టణంలోని ట్రిపుల్ ఐటి కళాశాల ఆవరణంలోని విద్యార్థులు జ్వరాలు, ఇతర అనారోగ్యాల బారినపడి చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజు కనీసం 150 మంది కళాశాల ఆవరణములోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జ్వరం, వాంతులు, విరోచనాలు, కడుపుల నొప్పిలతో విద్యార్థులు బాధపడుతున్నారు. గడచిన పది రోజులుగా విద్యార్థులు అనారోగ్యాల పాలవుతుంటే, బయటకు పోకుండా గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారాన్ని కొనసాగిస్తూ ఉండడంతో పాత్రికేయులు ఈ నిజాలను వెలికి తీశారు. స్పందించిన రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ఆదేశంతో ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సూచనల మేరకు డిఎం అండ్ హెచ్ఓ శర్మిష్ట, మెడికల్ సిబ్బంది బృందం ట్రిపుల్ ఐటీ కళాశాలకు పరిశీలనకు విచ్చేశారు. విద్యార్థులు, మెడికల్, కళాశాల సిబ్బందుల నుండి వివరాలను సేకరించారు. తాగునీరు, కలుషిత ఆహారంతో అనారోగ్యాలు ఏర్పడినట్లు ప్రాథమిక సమాచారంగా గుర్తించినట్లు డిఎం అండ్ హెచ్ఓ శర్మిష్ట తెలిపారు. ఈ మేరకు మెస్ లలోని వంట గదులు, వంట పాత్రలు, భోజన పదార్థాలతో పాటు భోజనాలు వడ్డించే ప్లేట్లను, తాగునీటిని పరిశీలించారు. ఉన్నతాధికా రుల ఆదేశంతో తాగునీటి శాంపిల్స్ తీసుకు వెళుతున్నట్లు చెప్పారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలోని బృందం ఇక్కడి ఆహారాన్ని శాంపిల్స్ గా తీసుకువెళతారని ఆమె తెలిపారు. మొత్తం సేకరించిన వివరాల ప్రకారం నివేదికను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి కి నివేదిక రూపంలో అందించనున్నట్లు వివరించారు. నూజివీడు పట్టణంలో ఉన్న నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలకు చెందిన పదివేలకు పైగా విద్యార్థులు ఉన్నారని, వీరందరి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా అన్ని రకాల చర్యలు చేపట్టాలని సిబ్బందికి, యాజమాన్యానికి సూచించినట్లు తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం





**నూజివీడు, మేజర్ న్యూస్:** పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎస్సి, ఎస్టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఆర్డిఓ వై భవాని శంకరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ భవాని శంకరి మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి కుటుంబాలపై జరిగే ఆకృత్యాలను నిరోధించేందుకు విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సకాలంలో స్పందించి విధులు నిర్వర్తించాలన్నారు. ఎస్సి, ఎస్టి మానిటరింగ్ కమిటీతో సమన్వయం ఏర్పాటు చేసుకుని ముందడుగు వేయాలని సూచించారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు అయ్యంకి సురేష్ బాబు మాట్లాడుతూ రెవిన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాలలో ప్రతినెల సివిల్ రైట్స్ డే పురస్కరించుకొని సమావేశాలు నిర్వహించాలన్నారు. ఎస్సి, ఎస్టిలకు చెందిన వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు ప్రత్యేకమైన న్యాయపరమైన అంశాలు, భారతీయ సంవిధానం 1950, వినియోగదారుల రక్షణ చట్టం 1986, సమాచార హక్కు చట్టం 2005, భారతీయ న్యాయ సంహిత 2023 లపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి నెల అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంపొందించేలా కృషి చేయాలన్నారు. ఎస్సి, ఎస్టిలకు చెందిన కుటుంబాలపై ఆకృత్యాలు జరిగితే తక్షణమే కమిటీ సభ్యులకు సంబంధిత పోలీసు శాఖ అధికారులు సమాచారం అందించాలన్నారు. ఇలాం టి సంఘటనలలో బాధితులకు రక్షణగా నిలిచే విధంగా కేసులు నీరుకారకుం డా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన ఆర్డిఓ భవాని శంకరి మాట్లాడు తూ బాధిత కుటుంబాలకు మానిటరింగ్ కమిటీతో పాటు సంబంధిత శాఖలకు చెందిన అధికారులు అండగా నిలుస్తారని, నిలవాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# చల్లపల్లిలో కేంద్ర బృంద సభ్యుల పర్యటన

## జలజీవన్ మిషన్ పనుల పరిశీలన – స్వచ్ఛ చల్లపల్లి సహకారానికి అభినందన






**చల్లపల్లి, మేజర్ న్యూస్ ఆగస్టు 28 :** జలజీవన్ మిషన్ పనులు, స్వచ్ఛభారత్ మిషన్ పనులను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున నేషనల్ వాటర్ ఎక్స్పర్ట్(ఎన డబ్ల్యుఈ) బృంద సభ్యులు డాక్టర్ సురేష్కుమార్, కె.రాఘవేంద్ర రావు అధికారుల బృందంతో కలిసి బుధవారం చల్లపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు ఏమేరకు పూర్తయ్యాయో పరిశీలించారు. తాగునీటి లభ్యత, అవసరాలు, వాటర్ టెస్టింగ్, జేజేఎం పనుల గురించి చర్చించారు. సంపద తయారీ కేంద్రంలో వర్మికంపోస్ట్ తయారీని పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే కాకుండా వినియోగిస్తున్నారో లేదో పరిశీలన చేశారు. స్వచ్ఛ చల్లపల్లి ఆధ్వర్యంలో మన కోసం మనం ట్రస్ట్ నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ను చూశారు. కమ్యూనిస్టు బజారులోని భూగర్భ డ్రైనేజీ నిర్మాణాన్ని, పద్మావతి హాస్పటల్ బజారులోని భూగర్భ డ్రైనేజీని పరిశీలించారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమ వివరాలు తెలుసుకుని గ్రామంలో 27 వేల మొక్కలు నాటిన విషయం తెలుసుకున్నారు. స్వచ్ఛ చల్లపల్లి సారధులు డాక్టర్ డిఆర్కే.ప్రసాద్, డాక్టర్ పద్మావతిలను కలిసి వారికి అభినందనలు తెలిపారు. జలజీవన్ మిషన్లో భాగంగా అదనపు పనుల ఆవశ్యకత తెలుసుకున్నారు. చల్లపల్లి గ్రామంలో మరొక ఓవర్హెడ్ ట్యాంకు నిర్మాణం, రెండు డైరెక్ట్ పంపింగ్ హౌస్లు అవసరమని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తెలిపారు. గ్రామ పంచాయతీలో విలేజ్ శానిటేషన్ అండ్ వాటర్ కమిటీ బృందం, సచివాలయ ఉద్యోగులు, వైద్యసిబ్బందితో సమావేశ మయ్యారు. గ్రామానికి వచ్చిన కేంద్ర బృంద సభ్యులకు సర్పంచ్ కృష్ణకుమారి, కార్యదర్శి పివి. మాధవేంద్రరావులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ డీఈ పి.సత్యనారాయణ, ఏఈ జగత్, జేజేఎం బృంద సభ్యులు మరో ఆరుగురు, స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డుసభ్యులు బళ్లా వాసు, షేక్ సిలార్, శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గృహాలను నిర్మించకుంటే రద్దే...



(మొదటిపేజీ తరువాయి)

పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన సూచించారు.
జి.కొండూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న గృహనిర్మాణ లేఅవుట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ జి. సృజన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జి కొండూరు సమీపంలో నిర్మిస్తున్న లేఅవుట్లో 360 మంది లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిలో 51 గృహా నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని 164 బిలో బేస్మెంట్ లెవెల్, 91 బేస్మెంట్ లెవెల్, 2 లింటల్ లెవెల్, 11 రూఫ్ లెవెల్, 34 రూఫ్ కాస్టింగ్ లెవెల్ దశలలో ఉన్నాయన్నారు. పేదలకు మంజూరు చేసిన గృహాలను రానున్న జూన్ నాటికీ తప్పనిసరిగా పూర్తి చేయవలసి ఉటుందన్నారు. నిర్మాణాలను చేపట్టకుంటే మంజూరైన గృహాలు





రద్దవుతాయని భవిషత్తులో కేంద్ర ప్రభుత్వం నుండి గృహాలు మంజూరయ్యే అవకాశం ఉండదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలలో రోడ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గృహా నిర్మణాలకు సంబంధించి లబ్ధిదారులకు చెల్లింపుల విషయంలో నిధుల కొరత లేదని పూర్తి చేసిన పనులకు ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలలో అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు నివేదిక సమర్పించాలని జలజీవన్ మిషన్ ఉపాధిహామీ నిధులతో పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సృజన ఆదేశించారు. లేఅవుట్ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట గృహా నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. రజిని కుమారి, హౌసింగ్ ఇఇ గఫూర్, డీఈ శ్రీనివాసరావు, డీఎస్ఓ మోహన్ బాబు, ఎంపీడీవో అనురాధ పాల్గొన్నారు.







## ఏలూరు కాలువలో ప్రమాదవశాత్తు గలంతైన వ్యక్తి

**గన్నవరం, ఆగస్టు 28, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం కేసరపల్లి వద్ద ఏలూరు కాలువలలో టవేరా కారు గుర్తింపు. కారుతోపాటు ఏలూరు కాలువలో ప్రమాదవశాత్తు గలంతైన వ్యక్తి కంకిపాడు మండలం మారేడు మాక గ్రామానికి చెందిన గుడిసె రాజేష్ (36)గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 2:00 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గల్లంతయిన గుడిసె రాజేష్ భార్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గుడిసె రాజేష్ భార్య అనూష ఫిర్యాదు మేరకు పోలీసులు, ఎన్టీఆర్ ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన జరిగిన ప్రదేశం వద్దకు కుటుంబ సభ్యులు చేరుకుని రాజేష్ ఆచూకీ కోసం కన్నీరు మున్నేరు అవుతున్నారు. ఉప్పులూరు నుంచి కేసరపల్లి వైపునకు వెళ్లే మార్గంలో ఏలూరు కాలువ దగ్గర మలుపులో రెండు వైపులా స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, కాల్వ అంచున రైలింగ్ నిర్మించి రేడియం స్టిక్కర్స్ అతికించాలని స్థానిక ప్రజలు అధికారులకు మనవి చేసుకుంటున్నారు.

# చంద్రబాబుతోనే బ్రాహ్మణుల అభివృద్ధి - సంక్షేమం




## చంద్రబాబు ప్రభుత్వం అర్చకులకు వేతనం, ధూప దీప నైవేద్యాలకు ఖర్చులు పెంచడం శుభ పరిణామం

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** అర్చకుల వేతనం పెంపు రూ.10 వేలు వేతనం పొందే అర్చకులకు ఇకపై రూ.15 వేలు, ధూప దీప నైవేద్యాలకు ఖర్చులు పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయానికి రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధి, తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికార సమితి కృష్ణా జిల్లా కన్వీనర్, పి. వి. ఫణి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మచిలీపట్నం సిడిబి అగ్రహారం లోని దేవాలయంలో చంద్రబాబు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అర్చకులు, బ్రాహ్మణులు చంద్రబాబు చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పి. వి. ఫణి కుమార్ మీడియాతో మాట్లాడుతూ దూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచడం హర్షనీయమన్నారు. నిరుద్యోగ పేద విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నెలకు రూ.3 వేలు భృతి కల్పిస్తామని తెలియజేయడం శుభ పరిణామం అన్నారు. దేవాలయ ఆస్తుల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పట్ల భక్తులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు అన్నారు. దేవాలయాల్లో పరిశుభ్రత, ప్రసాదంలో నాణ్యత, ప్రశాంత వాతావరణం కనిపించేలా చర్యలు తీసుకుంటామని తెలిపే నిర్ణయం మంచి పరిణామం అన్నారు. రాష్ట్రంలోని దేవాలయాల్లో ఆధ్యాత్మిక వెల్లివిరవాలని, అపచారాలకు చోటు ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించడం పట్ల భక్తులు ప్రశాంతత కోసం, తమ బాధలు దేవుడితో చెప్పుకోవడం కోసం గుళ్లకు వస్తారని...అలాంటి వారికి మంచి దర్శనం, చక్కటి వాతారణం కల్పించాల్సిన అవసరం ఉందని సిఎం చంద్రబాబు అన్నారు అని, దేవాలయాల్లో పరిశుభ్రత, ప్రసాదంలో నాణ్యత, ప్రశాంత వాతావరణం కనిపించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారని, ఏ కుటుంబమైనా పుణ్యక్షేత్రానికి వస్తే ఒకటి రెండు రోజులు అక్కడ ఉండే వాతావరణం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలపడం పట్ల హిందూ భక్తులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు అన్నారు. ట్రస్ట్ బోర్డులో ఒక బ్రాహ్మణుడు, ఒక నాయీ బ్రాహ్మణుడు తప్పకుండా ఉండేలా చూస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు సభ్యుల సంఖ్యను పెంచి వారికి అవకాశం కల్పించనున్నారు అని తెలిపారు. అదేవిధంగా రూ. 10 వేలు వేతనం పొందే అర్చకులకు ఇకపై రూ. 15 వేలు ఇవ్వనున్నారు అని, అదేవిధంగా దూపదీప నైవేద్యాలకు దేవాలయాలకు ఇచ్చే మొత్తం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ సిఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం వల్ల రాష్ట్రంలోని బ్రాహ్మణులు అందరూ హర్షం వ్యక్తం చేసి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు అన్నారు. వేద విద్య చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారికి నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలని సిఎం సూచించారు అని తెలిపారు. దేవాలయ ఆస్తుల పరిరక్షణకు కమిటీల ఏర్పాటు చేయాలని కూడా సమీక్షలో సిఎం అధికారులకు ఆదేశించారు అని తెలిపారు.

గోదావరి, కృష్ణా నదీ హారతులు మళ్లీ నిర్వహించాలని సిఎం చంద్రబాబు సూచించారు అని, ప్రతి దేవాలయంలో ఆన్ లైన్ విధానం అమలు చేయాలని, అన్ని సర్వీసులు ఆన్ లైన్ ద్వారా అందాలని సీఎం చంద్రబాబు తెలిపారు అన్నారు. ధనికులే కాకుండా సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా బస చేసే పరిస్థితి ప్రముఖ దేవాలయాల్లో ఉండాలని సీఎం చంద్రబాబు తెలిపారు అన్నారు. దేవాలయాలకు విరాళాలు ఇచ్చిన వారిని ప్రోత్సహించండి వారి పేర్లు ప్రకటించండి అని అధికారులకు చంద్రబాబు సూచించారు అన్నారు. గతంలో దేవాలయాల్లో జరిగిన పలు ఘటనలపై లోతుగా విచారణ జరపాలని చంద్రబాబు ఆదేశించారు అన్నారు. రానున్న రోజుల్లో దేవాలయాల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని సిఎం చంద్రబాబు అధికారులకు సూచించడం శుభ పరిణామం అన్నారు. అర్చకుల వేతనం పెంచి, ధూప దీప నైవేద్యాలకు పదివేల రూపాయలు ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి అన రామనారాయణరెడ్డి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాల సౌరులకు, ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులకు కూడా రాష్ట్రంలోని బ్రాహ్మణుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాము అని ఫణి కుమార్ పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి.వి.ఫణి కుమార్ తో పాటుగా, బిజెపి నాయకు లు, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు, వేమూరి రామకృష్ణారావు, గాదే శ్రీనివాస శర్మ, వేమూరి నాగ సాయి శర్మ, మోపర్తి సుబ్రమణ్యం, వేమూరి బుజ్జి, చలపతిరావు, గూటాల సత్యనారాయణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణుల హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు

## ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సాధికారత కమిటీ అధ్యక్షులు బుచ్చి రామ్‌ప్రసాద్



**విజయవాడ, ఆగష్టు 28, మేజర్ న్యూస్ :** యువగళం పాదయాత్రలో భాగంగా వెంకటగిరిలో టీడీపీ యువ నేత, ప్రస్తుత మంత్రి నారా లోకేష్ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణసాధికారత కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బుచ్చి రామ్‌ప్రసాద్ అన్నారు. విజయవాడలోని ఓ హోట ల్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడారు. బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను కేవలం మూడు నెలలు తిరగ్గ ముందే అమలుకు శ్రీకారం చుట్టిన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు చొరవ తోనే బ్రాహ్మణుల సమస్యల పరిష్కారమయ్యాయని, గత ప్రభుత్వంలో ఎదు రైన ఇబ్బందులు ఇక తీరనున్నాయని చెప్పారు. బ్రాహ్మణ సాధికారత కమిటీ సంఘం నాయకులు సత్యవాడ.దుర్గా ప్రసాద్. మాట్లాడుతూ ఇటీవల సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన దేవాదాయశాఖ సమీక్షలో బ్రాహ్మణులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ముందడుగు పడిందన్నారు. కేవలం రెండు సమస్యలనే మళ్లీ చర్చించి పరిష్కరిద్దామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఇంకా మిగిలిన రెండు సమస్యలపై త్వరలో అమలుకు చంద్రబాబు స్పష్టత ఇచ్చారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాముడు, వినాయకుడు విగ్రహాల ధ్వంసం, రథం కాలిపోవటం, అమ్మవారి గుడిలో వెండి సింహాల దొంగతనం, పురోహితులపై దాడులు, దేవస్థానాల భూముల అన్యాక్రాంతం తదితర సంఘటనలపై ఒక ప్రత్యేక కమిటీ వేసి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని వివరించారు. గత ప్రభుత్వం ప్రతి మంగళవారం అప్పులకు వెళ్లగా, చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు మూడు నెలలవుతున్నప్పటికీ, ఇంతవరకూ అప్పులకు వెళ్లలేదన్నారు. నిత్యం ప్రజల సమస్యలను తీర్చేందుకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషిచేస్తూ దిగ్విజయంగా ముందుకు సాగేందుకు బ్రాహ్మణ సామాజిక వర్గం తరపున ఎల్లప్పుడూ చేయూతగా ఉంటామని, సీఎం చంద్రబాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. మాజీ టీటీడీ సభ్యులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏబీ. రమణ మాట్లాడుతూ, పురోహితులకు వేతనాలను, ధూపదీప నైవేద్యాలకు నిధులను పెంచారని, ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ ప్రభుత్వం కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు.

## మున్సిపల్ కమిషనర్‌గా ఏవి రమణ బాబు బాధ్యతలు



**నందిగామ, ఆగస్టు 28, మేజర్ న్యూస్ :** మున్సిపల్ కమిషనర్‌గా ఇవి రమణ బాబు బుధవారం బాధ్యతలు స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఇవి రమణ బాబు మాట్లా డుతూ పట్టణంలో ప్రజలకు నిత్యం అం దుబాటులో ఉంటానని పట్టణ అభివృద్ధి కి ప్రజాప్రతినిధులు ప్రజల సహకారం కావాలని ఆయన కోరారు. క్లీన్ నందిగా మ గ్రీన్ నందిగామ ధ్యేయంగా పని చేస్తానన్నారు.పట్టణములో సమస్యలపై దృష్టి పెడతానని పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి పెడతానని తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని కమిషనర్ తెలిపారు.

## వీరులపాడు ఎస్సైగా జి.అనిల్



**నందిగామ, ఆగస్టు 28, మేజర్ న్యూస్:** వీరులపాడు ఎస్ఐగా జి. అనిల్ బాధ్యతలు బుధవారం ఈ సంద ర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతానని తెలిపారు. అక్రమ మద్యం తరలించిన, గంజాయి తరలించిన పేకాట, కోడి పందాలు ఆడిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మండల పరిధిలోని ప్రజలు ఏ సమస్య ఉన్న తనను నేరుగా వచ్చి కలవవచ్చునని ఈ సంద ర్భంగా ఆయన సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

### సీజనల్ వ్యాధుల పట్ల

# అప్రమత్తంగా ఉండండి

### ఎమ్మెల్యే కుమార్ రాజా



**మొవ్వ (ఆగస్టు 28) మేజర్ న్యూస్:** గ్రామాల్లో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రమైన మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్యం పట్ల ఆరా తీయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం వేద రాజ్, డాక్టర్ రాజేశ్వరిలకు సూచించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను అందుతున్న వైద్య సేవలపై ఎమ్మెల్యే ఆరా తీశారు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకటేష్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999